# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్
19.01.2025

24 క్యారెట్లు 88,445.00 | కిలో వెండి 99,785.00 | 30°C

సంపుటి:3 | సంచిక:88

www.vishalabharati.com




## కమర్షియల్ వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్

- గ్లోబల్ సిటీ రియల్ మార్కెట్‌లో సరికొత్త ట్రెండ్
- దేశంలోనూ క్రమంగా పెరుగుతున్న కో వర్కింగ్, ఆఫీస్ స్పేస్
- మెరుగైన వనరులతో నగరానికి పుష్కలమైన అవకాశాలు

3 లో

# బీజేపీ అధ్యక్ష రేసులో ఈటల

- నెలాఖరుకు ఖరారు చేయనున్న అధిష్టానం
- అధ్యక్ష పదవికి ఆర్ఎస్ఎస్ బ్యాగ్రౌండ్ అక్కర్లేదు
- రెండు సార్లు పార్టీ సభ్యత్వం ఉంటే చాలు
- ఈటల కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు
- నేను పిలిస్తేనే చిరంజీవి ఢిల్లీకి వచ్చారు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



*రాష్ట్రంలో బీజేపీ అధ్యక్ష పదవిపై, ఇటీవల చిరంజీవి తమ నివాసంలో సంక్రాంతి వేడుకల్లో పాల్గొనటంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి. నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో శనివారం నాడు మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సమయంలో బీజేపీ అధ్యక్ష పదవిపైన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ అధ్యక్షుడు కావాలంటే ఆర్ఎస్ఎస్ బ్యాక్ గ్రౌండ్ ఉండాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రెండుసార్లు బీజేపీ క్రియాశీలక సభ్యత్వం ఉంటే సరిపోతుందని ఆయన వెల్లడించారు. అంతేకాదు రెండుసార్లు బీజేపీ గుర్తుపై పోటీ చేసినా సరిపోతుందని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు బీజేపీ నుండి మల్కాజ్‌గిరి ఎంపీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈటల రాజేందర్ కూడా బీజేపీ అధ్యక్ష రేసులో ఉంటారని కిషన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు.*

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కిషన్ రెడ్డి వ్యాఖ్యలతో రాబోయే రోజుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఈటల రాజేందర్ అవుతారా అన్నది ఇప్పుడు పార్టీలో ఆసక్తికరంగా మారింది. ఇక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని నిర్ణయించే విషయంలో పూర్తి నిర్ణయాధికారం అధిష్టానానికే ఉందని కిషన్ రెడ్డి తెలిపారు. నెలాఖరుకు అధ్యక్షుడిని ఖరారు చేస్తారని తెలిపారు. ఇక ఇదే సమయంలో ఢిల్లీలో కిషన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలలో చిరంజీవి పాల్గొనడం పైన కూడా ఆయన స్పందించారు. మెగాస్టార్ చిరంజీవితో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని ఆ సంబంధాల నేపథ్యంలో తాను పిలిస్తే తన మాట కాదనకుండా చిరంజీవి వస్తారని ఆయన అన్నారు. ఇద్దరు ఒకరిని ఒకరం కుటుంబ సభ్యులుగా భావిస్తామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఒక్క చిరంజీవి మాత్రమే కాదు చాలామంది సినీ ప్రముఖులతో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని చాలామంది పార్టీలో చేరి మంత్రులు, కేంద్ర మంత్రులు కూడా అయ్యారని కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొన్న సమయంలో పదవిని ఎవరికి కట్టబెట్టబోతున్నారు అన్నది అందరూ ఆసక్తిగా చూస్తున్న తరుణంలో కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో మరింత ఆసక్తి నెలకొంది.

**స్థానిక సంస్థ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ..**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పోటీపై కేంద్ర మంత్రి, టీ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో

..మిగతా 2 లో



## ఉగాదికి గద్దర్ సినీ అవార్డులు

- నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం
- డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

2 లో



## అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు..

### అధికారులు అవగాహన కల్పించాలి

- ఇది తుది జాబితా కాదు.. రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్

విశాలభారతి, స్టేట్‌బ్యూరో:

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి

..మిగతా 2 లో

## రూ.41 కోట్లు ఎందుకిచ్చారు?

- క్రీడలతో సంబంధం లేని మీరు ఎందుకు ఈ రంగంలోకి దిగారు?
- కేటీఆరే మిమ్మల్ని ఆహ్వానించారా?
- రేసు నుంచి మధ్యలోనే ఎందుకు వైదొలిగారు?
- ఫార్ములా-ఈ కేసులో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ అనిల్‌కు ఏసీబీ ప్రశ్నలు
- నష్టం వల్లే తప్పుకొన్నామన్న అనిల్..
- మూడున్నర గంటల పాటు కొనసాగిన విచారణ
- మరోసారి విచారణకు రావాలని తెలిపిన ఏసీబీ



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ఫార్ములాఈ కారు రేసు ప్రమోటర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీ ప్రతినిధులు శనివారం ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. వీరిలో ఆ సంస్థ ఏండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారి నుంచి వివరాలు రాబట్టేందుకు ఏసీబీ అధికారులు పలు ప్రశ్నలు సంధించారు. క్రీడల్లో ఏమాత్రం అనుభవం లేని మీ కంపెనీ ఇందులోకి ఎందుకు దిగింది? ఎవరు మిమ్మల్ని ఆహ్వానించారు? మీకే విధమైన హామీలిచ్చారు? ఒప్పందానికి ముందే బీఆర్ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.41 కోట్ల మొత్తం ఎందుకిచ్చారు? రేసు ద్వారా మీ కంపెనీకి లాభం వచ్చిందా? నష్టం వచ్చిందా? ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ రెండో సెషన్ పూర్తి చేయకుండానే ఎందుకు వైదొలిగారు? తదితర ప్రశ్నలు అడిగారు. మాజీమంత్రి కేటీఆర్‌తో ఉన్న సాన్నిహిత్యానికి సంబంధించి కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. 'ఫార్ములాఈ కారు రేసులో ప్రమోటర్‌గా ఉండ బోతున్న విషయం మీకు ఎప్పుడు తెలిసింది? మిమ్మల్ని ప్రమోటర్‌గా

..మిగతా 2 లో



## మా అన్ననే ఇవన్నీ చేయిస్తున్నాడు

- తారస్థాయికి మంచు కుటుంబం విభేదాలు
- "సీనియర్ సిటిజన్ యాక్ట్" నోటీసులపై మనోజ్ రియాక్షన్
- కలెక్టర్ ఎదుట విచారణకు హాజరు
- నాపై ఎన్నో కేసులు పెట్టారు, భయపడేది లేదు
- న్యాయం కోసమే నా పోరాటం
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంచు మనోజ్ వాఖ్యలు

2 లో

## రేషన్ కార్డులకు.. సర్వేకు లింకెందుకు..?

- లబ్ధిదారులను తగ్గించేందుకు సర్కారు ప్లాన్
- ప్రజాపాలన దరఖాస్తులు బుట్టదాఖలు
- వార్షిక ఆదాయ పరిమితిని పెంచాలి
- సీఎం రేవంత్‌కు హరీష్‌రావు బహిరంగ లేఖ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కులగణన సర్వేకు రేషన్ కార్డులకు ఎందుకు ముడిపెట్టారని ప్రశ్నించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్ కార్డులు ఇవ్వరా అని నిలదీశారు. కుల గణన సర్వేను బేస్ చేసుకొని, ఆ లిస్టును మాత్రమే



..మిగతా 2 లో




## పురుగు మందు తాగి..

## బ్యాంకులోనే రైతు ఆత్మహత్య

- అప్పు కట్టలేదని అధికారుల వేధింపులు
- తట్టుకోలేక బ్యాంకులోనే సూసైడ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

బ్యాంకు సిబ్బంది వేధింపులకు ఓ రైతు బలయ్యాడు. అప్పు తీసుకున్న బ్యాంకులోనే అందరూ చూస్తుండగానే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం రేణిగూడకు చెందిన రైతు ఆదిలాబాద్‌లోని

..మిగతా 2 లో



## స్థానిక ఎన్నికల్లోపే కేబినెట్ విస్తరణ

- ఎన్ని పదవులు భర్తీ చేస్తారో తెలియదు
- సీఎం రాష్ట్రానికి రాగానే ఫైనల్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణ మంత్రి మండలి విస్తరణపై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపే

..మిగతా 2 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
19.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com
vishalabharathi Telugu Daily



# రూ.41 కోట్లు ఎందుకిచ్చారు?

**తరువాయి భాగం:**

ఆహ్వానించింది కేటీఆరేనా? ప్రమోటర్‌గా అవకాశం లభించనున్న సంగతి తెలిసే.. రేసు ప్రారంభం అవడానికి ముందు ఏస్ నెక్స్ట్ జెన్, ఏస్ రేస్ కంపెనీలను ప్రారంభించారా? అప్పట్లో మీకు, రాష్ట్ర పురపాలకశాఖకు, అప్పటి మంత్రి కేటీఆర్‌కు మధ్య జరిగిన సంభాషణలేమిటి?' అంటూ అనిల్ కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది.రేసు మొదటి సెషన్‌కు సంబంధించి 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' (ఎఫ్‌ఈఓ) కంపెనీకి చెల్లించాల్సిన రూ.90 కోట్ల ఫీజును ఏస్ అర్బన్ డెవలపర్స్ నుంచి రుణం రూపంలో ఎందుకు తీసుకున్నారనే కోణంలోనూ ఏసీబీ విచారణ కొనసాగినట్లు సమాచారం. ఏస్ అర్బన్ డెవలపర్స్ కంపెనీ ఏస్ నెక్స్ట్ జెన్, ఏస్ రేస్ కంపెనీల అనుబంధ సంస్థనే కావటం గమనార్హం. కాగా, విచారణకు సమయం తక్కువగా ఉండటంతో మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని, మళ్లీ నోటీసు ఇస్తామని ఏసీబీ అధికారులు అనిల్ కుమార్ బృందానికి తెలిపినట్లు సమాచారం. అధికారుల ప్రశ్నలకు అనిల్ కుమార్ సమాధానమిస్తూ.. అప్పట్లో ఏం జరిగిందనే సంగతిని వివరంగా వెల్లడించినట్లు తెలిసింది. ఎలక్టోరల్ బాండ్లను అన్ని రాజకీయపార్టీలకు ఇచ్చినట్లే బీఆర్‌ఎస్‌కు ఇచ్చామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తమ కంపెనీ చట్టపరంగా ఒప్పందం చేసుకుందని, నష్టం రావడంతో రెండో సెషన్ నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని, నాటి అధికారులకు, మంత్రికి చెప్పిన తర్వాతే తప్పుకొన్నామని అనిల్ వెల్లడించారు.హైదరాబాద్‌లో నాలుగు సెషన్లలో ఫార్ములాఈ కారు రేసు నిర్వహించడం కోసం రాష్ట్ర పురపాలకశాఖ, ఎఫ్‌ఈఓ, ఏస్ నెక్స్ట్ జెన్ మధ్య 2022 అక్టోబరు 25న త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం ఏస్ నెక్స్ట్ జెన్ ప్రమోటర్‌గా ఉంటూ 9, 10, 11, 12 సెషన్లకు సంబంధించిన ఫీజును ఎఫ్‌ఈఓకు వాయిదాల రూపంలో చెల్లించాలి. బ్రిటన్‌కు చెందిన ఎఫ్‌ఈఓతో అప్పటి పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తొలిదఫా చర్చలు జరిపిన తర్వాత.. హఠాత్తుగా ఏస్ నెక్స్ట్ జెన్, ఏస్ రేస్ కంపెనీలను 2022 జూలైలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కంపెనీల రిజిస్ట్రేషన్‌కు 15 రోజుల ముందే ఏస్ నెక్స్ట్ జెన్, ఏస్ రేస్ కంపెనీల మాతృసంస్థ గ్రీన్కో నుంచి రూ.10 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీఆర్ఎస్‌కు అందాయి. దానికి రెండు నెలల ముందు కూడా గ్రీన్కో నుంచే బీఆర్‌ఎస్‌కు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.31 కోట్లు లభించాయి. 9వ సెషన్ పూర్తయిన తర్వాత పదో సెషన్ ప్రారంభానికి ముందే ఏస్ నెక్స్ట్ జెన్ ఒప్పందం నుంచి వైదొలిగింది. కేటీఆర్ ఆదేశాల మేరకు పుర పాలకశాఖ అధికారులు హెచ్‌ఎండీఏ నుంచి రూ.45.71 కోట్ల మొత్తాన్ని ఎఫ్‌ఈఓకు పౌండ్ల రూపంలో చెల్లించారు. వీటన్నింటిపైనా ఏసీబీ దర్యాప్తు చేస్తోంది.

# బీజేపీ అధ్యక్ష రేసులో ఈటల

**తరువాయి భాగం:**కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేశామని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నాడని.. అసలు రేవంత్ రెడ్డి చెబితే ఢిల్లీ ప్రజలకు కాంగ్రెస్‌కు ఓటేస్తారా అని నిలదీశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. ఉచితాలకు బీజేపీ వ్యతిరేకం కాదని.. కానీ ప్రజలను మోసం చేయకుండా రాష్ట్ర ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని హామీలు ఇవ్వాలని సూచించారు. అలా కాకుండా అడ్డగోలు హామీలు ఇచ్చి రాష్ట్రాని దివాలా తీయించే పరిస్థితులు తీసుకురావొద్దని సూచించారు. ఇక, నిజామాబాద్‌లో కాంగ్రెస్ వల్లే జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు అయ్యిందన్న కాంగ్రెస్ నాయకులను ఈడ్చి కొట్టాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు కిషన్ రెడ్డి.

# మా అన్ననే ఇవన్నీ చేయిస్తున్నాడు

- తారస్థాయికి మంచు కుటుంబం విభేదాలు
- "సీనియర్ సిటిజన్ యాక్ట్" నోటీసులపై మనోజ్ రియాక్షన్
- కలెక్టర్ ఎదుట విచారణకు హాజరు
- నాపై ఎన్నో కేసులు పెట్టారు, భయపడేది లేదు
- న్యాయం కోసమే నా పోరాటం
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంచు మనోజ్ వాఖ్యలు

**విశాలభారతి, ఇబ్రహీంపట్నం:**



తన తండ్రి మంచు మోహన్ బాబు వెనకాల ఉండి మా అన్న మంచు విష్ణు నాటకాలు ఆడుతున్నాడు , అన్ని పంచాయతీలకు కారణం అవ్వన్నారని మంచు మనోజ్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంచు మోహన్ బాబు, మనోజ్ ఆస్తుల పంచాయితీ శనివారం కలెక్టర్ వద్దకు చేరింది. జల్లపల్లి నివాసాన్ని తనకు స్వాధీనం చేయాలని కలెక్టర్‌కు మోహన్ బాబు ఫిర్యాదు చేశారు. తన నివాసంలో కొందరు అక్రమంగా ఉంటున్నారని, వెంటనే ఖాళీ చేయించాలని, సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం తన ఆస్తులను స్వాధీనం చేసి ఇవ్వాలని కలెక్టర్‌ను మోహన్ బాబు కోరారు. అయితే ఈ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ మంచు మనోజ్‌కు నోటీసులు జారీ చేశారు. కాగా కొన్ని రోజుల క్రితం మంచు మోహన్ బాబు, మనోజ్ మధ్య ఆస్తుల వివాదం జరిగిన విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి కూడా మోహన్ బాబు తిరుపతిలో ఉంటున్నారు. మనోజ్ జల్లపల్లిలోని మోహన్ బాబు ఇంట్లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మోహన్ బాబు కలెక్టర్‌ను ఆశ్రయించారు. తన ఆస్తులను కొడుకు మనోజ్ నుంచి స్వాధీనం చేయించాలని కోరారు. కలెక్టర్ ను కలిసిన అనంతరం మంచు మనోజ్ మీడియా సమావేశంలో మాట్లాడారు. తనపై అన్న , తండ్రి కలిసి ఎన్నో కేసులు పెట్టారనీ కేసులకు భయపడేది లేదని అన్నారు. తమ కుటుంబంలో ఆస్తి తగాదాలు లేవని చెప్పారు. తిరుపతి యూనివర్శిటీ లో ఉన్న ఇంట్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తానని అన్నారు.

# రేషన్ కార్డులకు.. సర్వేకు లింకెందుకు..?

**తరువాయి భాగం:**



ప్రింట్ తీసి గ్రామాలకు పంపించారని అన్నారు. ఆన్ లైన్‌లో మీ సేవలో కొన్ని లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రజా పాలన సమయంలోనూ దరఖాస్తులు చేశారని తెలిపారు. ఆ దరఖాస్తులు అన్నింటినీ చెత్తబుట్టలో వేశారని అన్నారు. ప్రజాపాలనలో 11లక్షల దరఖాస్తులు వస్తే ఎందుకు పరిశీలించడం లేదని ప్రశ్నించారు. మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను ఎందుకు పరిశీలించడం లేదని నిలదీశారు. కుల గణన సర్వే చేసేటప్పుడు ఇది ఆప్షనల్ మాత్రమే.. బలవంతం లేదని.. ఇష్టం ఉన్నవారు మాత్రమే పాల్గొనవచ్చని చెప్పారు కదా అని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రం దాన్ని బేస్ చేసుకొని అర్హులకు రేషన్ కార్డులు రాకుండా కోతలు పెడుతున్నరని మండిపడ్డారు. వాయిదా వేసుకుని అయినా సరే అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే గ్రామగ్రామన నిరసనలు తప్పవని హెచ్చరించారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వకపోతే ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. అర్హులకు రేషన్ కార్డులు వచ్చే దాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కార్డుల మంజూరులో వార్షిక ఆదాయ పరిమితిని గ్రామీణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.3.40 లక్షలకు పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో ఇరవై పనిదినాలు పాల్గొన్న వారి వివరాలు తీసుకొని.. ఆరు శాతం మందికి అమలు చేసి మిగతా 94 శాతం మందికి ఎగ్గొట్టాలని చూస్తున్నారు. ఎకరాలోపు భూమి ఉన్నవారందరికీ ఈ పథకాన్ని అమలు చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల ఇస్తామని.. ఇప్పుడు రూ.5 లక్షలే అంటున్నారు. ఆదిలాబాద్ జిల్లా బేల మండలానికి చెందిన రైతు ఆత్మహత్య.. ప్రభుత్వ హత్య. ఆ రైతుకు రుణమాఫీ అమలు చేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఆయన కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం అందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు..



**తరువాయి భాగం:**

కుమారి చెప్పారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు విషయమై ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామ సభల నిర్వహణ, తదితర అంశాలపై శనివారం డాక్టర్ బీఆర్అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్ధిదారుల జాబితా, కులగణన (సామాజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని, ఇది తుది జాబితా కాదన్నారు.

ఈ నెల 26వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతున్నదని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను కొన్ని విపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారి ట్రాప్‌లో అధికారులు పడకూడదన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డుల జారీ, రేషన్ కార్డుల్లో కొత్త సభ్యుల చేరికలకు దరఖాస్తులు కూడా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే, గతంలో జరిగిన ప్రజా పాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు.

రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇస్తామని మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొన సాగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన భూమికి రైతు భరోసా కల్పిస్తామన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు తహసీల్దార్ల వద్ద ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు.

# ఉగాదికి గద్దర్ సినీ అవార్డులు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ ఉగాదికి గద్దర్ తెలంగాణ చలనచిత్ర అవార్డులను అందజేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది, అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు శరవేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. శనివారం సచివాలయంలో గద్దర్ అవార్డుల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో గద్దర్ అవార్డులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

గద్దర్ అవార్డుల కోసం లోగోతో సహా విధి విధానాలు, నియమ నిబంధనలపై కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహించాలని సూచించారు. కల్చరల్ ఐకాన్ గద్దర్ ప్రతిష్టపెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు, అవార్డుల పంపిణీ జరగలేదని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే అవార్డులను ప్రతి ఏటా అందజేయాలని నిర్ణయించి గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులు ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం ఇవన్నట్టు భట్టి విక్రమార్క తెలిపారు. ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు. గద్దర్ అవార్డుకు సంబంధించి లోగోను కూడా రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.




# పురుగు మందు తాగి..

# బ్యాంకులోనే రైతు ఆత్మహత్య

**తరువాయి భాగం:**

ఐసీఐసీఐ బ్యాంకులో 2019 లో భూమిని కుదువ పెట్టి రూ.3.50 లక్షల రుణం తీసుకున్నాడు. ఏడాదికి కొంత వడ్డీని కడుతూ వస్తున్నాడు. గత ఏడాది కాలంగా పంటలు సరిగా పండక వడ్డీ కట్టలేకపోయాడు. వడ్డీని చెల్లించలేని పక్షంలో భూమిని జప్తు చేసుకుంటామంటూ బ్యాంకు అధికారులు తేల్చి చెప్పారు. దీంతో తనకు ఇన్నాళ్లు అన్నం పెట్టిన భూమి పోతుందని మనోవేదనకు గురైన రైతు దేవరావు పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు వచ్చి అందరూ చూస్తుండగానే క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన సెక్యూరిటీ గార్డ్ రైతును పక్కనే ఉన్న కుర్చీలో కూర్చోబెట్టి బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చాడు. అంతలోనే రైతు తీవ్ర అస్వస్థకు గురై అక్కడికక్కడే కూలిపోయి ప్రాణాలు విడిచాడు. ఈ ఘటనకు సంబందించిన దృశ్యాలు బ్యాంకు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. పెద్ద పెద్ద బడా బాబులు బ్యాంకు లోన్లు తీసుకుని విదేశాలకు వెళ్లి ఎంజాయ్ చేస్తుంటే.. ఏం చేయలేని అధికారులు.. ఇలా చిన్న, సన్నకారు రైతులను వేధింపులకు గురిచేయడంపై పలవురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికల్లోపే కేబినెట్ విస్తరణ

**తరువాయి భాగం:**

కేబినెట్ విస్తరణ ఉంటుందని అన్నారు. ఈ మంత్రివర్గ విస్తరణపై విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి వచ్చాక చర్చిస్తామని తెలిపారు. తాము చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని హైకమాండ్ చెప్పిందని అన్నారు. చేసిన పనిని చెప్పుకోవడానికి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని కేసీ వేణుగోపాల్ అడిగినట్లు తెలిపారు. ప్రజల డబ్బు వృథా అవుతుందని.. అందుకే పబ్లిసిటీ చేయడం లేదని వివరణ ఇచ్చినట్లు చెప్పారు. అంతేకాదు.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

# బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో బడే దామోదర్ మృతి..

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీజాపూర్‌లోని పుజారి కంకేర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బడే చొక్కారావుతో పాటు 17 మంది మృతి చెందారు. మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరుతో లేఖ విడుదల చేశాడు. బడే చొక్కా రావు, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా పని చేశాడు. బడే చొక్కా రావు అలియాస్ (దామోదర్, మల్లన్న) ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, కాల్వపల్లి గ్రామవాసి. ఇతను మిలిటరీ చీఫ్‌గా కూడా పనిచేశాడు. గతంలో భద్రతా దళాలను టార్గెట్ చేసి వారిపై కాల్పులు, ల్యాండ్ మైన్ పేల్చిన ఘటనలో కీలక పాత్ర పోషించాడు. చొక్కా రావు తల్లి బతుకమ్మ. గతంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ 2021లో కోవిడ్ బారిన పడి మరణించాడు. అప్పటి నుంచి ఆ స్థానం ఖాళీగా ఉంది. అయితే ఈ స్థానాన్ని భర్తీ చేసేందుకు మావోయిస్టు పార్టీ పలువురి పేర్లు పరిశీలించింది. ఈ క్రమంలో ఆజాద్ పేరు సైతం తెరపై వినిపించగా చివరకు చొక్కారావు పేరు ఖరారు చేశారు. తెలంగాణ జిల్లాల్లో మంచిపట్టున్న బడేచొక్కారావు ఎటురు నాగారం.. ములుగు... మహబూబాబాద్ ప్రాంతాల్లో ఆక్టివ్ గా పని చేశాడు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బడే చొక్కా రావు నియామకంతో రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాల పునరుద్ధరణకు సహాయపడింది.ఈ నేపథ్యంలో అతడి హతం మావోయిస్టు పార్టీకి తీరని లోటుగా మారింది. దీంతో పార్టీ కార్యకలాపాలను సాగించడం అస్థవ్యస్తంగా మారుతుందని పలువురు భావిస్తున్నారు.ఇదిలా ఉండగా.. శుక్రవారం సుక్మాబీజాపూర్ సరిహద్దులో ఎన్‌కౌంటర్ జరిగిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతాన్ని పరిశోధించడంలో సైనికులు పెద్ద విజయం సాధించారు. సుక్మా డీఆర్‌జీ సైనికులు నక్సల్స్ సొరంగం కనుగొన్నారు. సుక్మా బీజాపూర్ సరిహద్దు ప్రాంతంలో ఉన్న తుమ్రైల్, తాల్పేరు నది మధ్య నక్సలైట్ల డంప్‌ను డీఆర్‌జీ సుక్మా సైనికులు స్వాధీనం చేసుకున్నారు.



వేల కోట్ల పెట్టుబడులు, ఐటీ, ఐటీయేతర రంగాల పెట్టుబడులతో క్యాపిటల్ ఆఫ్ ఇన్వెస్ట్ మెంట్ సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరం.. అదే జోరుతో రియల్ ఎస్టేట్ రంగానికి పుష్కళమైన అవకాశాలను అందిస్తోంది. ఓవైపు అంతర్జాతీయ స్థాయిలో స్కై స్ర్కాపర్లు, లగ్జరీ విల్లాలు అల్ట్రా మోడ్రన్ రెసిడెన్షియల్ ప్రాజెక్టులు విస్తరిస్తుంటే.. మరోవైపు విదేశాలకు ఏ మాత్రం తగ్గకుండా కమర్షియల్, ఆఫీస్, కో వర్కింగ్ స్పేస్ వంటి అనుబంధ రంగాలు డిమాండ్‌ను పెంచుకుంటున్నాయి. స్టార్టప్‌లకు, యంగ్ ఎంట్రప్రెన్యూర్లకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో విదేశీ కంపెనీలు కూడా ఇక్కడ కార్యాకలాపాలను ప్రారంభిస్తున్నాయి. దీంతో ఒకప్పుడు బెంగుళూరు, ఢిల్లీ వంటి నగరాలకు ప్రాధాన్యతనిచ్చిన కంపెనీలు కూడా హైదరాబాద్ వైపు దృష్టి సారించడంతో కమర్షియల్ స్పేస్ డిమాండ్ పెరుగుతున్నట్లుగానే, ఇందులో కో వర్కింగ్ స్పేస్ వైపు రియల్ సంస్థలు మొగ్గుచూపుతున్నాయి.

# కమర్షియల్ వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్

## గ్లోబల్ సిటీ రియల్ మార్కెట్‌లో సరికొత్త ట్రెండ్

## దేశంలోనూ క్రమంగా పెరుగుతున్న కో వర్కింగ్, ఆఫీస్ స్పేస్

## మెరుగైన వనరులతో నగరానికి పుష్కళమైన అవకాశాలు



**విశాలభారతి, హైదరాబాద్ :**

కరోనా తర్వాత దేశంలో కో వర్కింగ్ స్పేస్ వినియోగం రెండింతలు పెరిగినట్లుగా నివేదికలు ఉన్నాయి. ఓవైపు హైబ్రిడ్ మోడ్ విధానంలో ఐటీ, ఐటీయేతర కంపెనీలూ కార్యాకలాపాలు కొనసాగిస్తున్నప్పటికీ... కో వర్కింగ్ స్పేస్‌కు డిమాండ్ పెరుగుతున్నది. దీనికి కరోనా తర్వాత మెజార్టీ కంపెనీలు సాంప్రదాయ కార్యాలయాల కంటే సౌకర్యవంతంగా ఉండే ఆఫీస్ స్పేస్ నుంచి కార్యాకలాపాలు నిర్వహించేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. కరోనా సమయంలో స్టార్ హోటల్స్, రిసార్టులన్నీ ఆఫీస్ సిబ్బందితో నిండిపోగా, ఇప్పుడు అదే తీరుగా కో వర్కింగ్ స్పేస్‌ల వైపు కంపెనీలు దృష్టిసారిస్తున్నాయి. తాజాగా వెల్లడైన పలు నివేదికల ప్రకారం 2024 తొలి క్యూ1 ఫలితాల ప్రకారం మొదటి ఏడు నగరాల్లో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో కో వర్కింగ్ స్పేస్ వాటాను భారీగా పెరిగింది. 2023తో పోల్చితే 15శాతం వృద్ధి ఈ రంగంలో నమోదు కావడం రియల్ వర్గాలనే ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ జాబితాలో బెంగుళూరు, నోయిడా, పుణే, చెన్నయ్ వంటి నగరాలు ముందు వరుసలో ఉండగా... రెండేళ్ల కాలంగా క్రమంగా హైదరాబాద్ వాటాను పెంచుకుంటున్నది.



### బెస్ట్ ఛాయిస్‌గా దక్షిణాధి రాష్ట్రాలు

ఇటీవల వెలువరించిన నివేదిక ప్రకారం క్రమంలో దక్షిణాధిలో ఉన్న మెట్రో నగరాలు ఈ రంగంలో వాటాను పెంచుకుంటున్నాయి. గతేడాదిలో వెల్లడైన పలు నివేదిక ప్రకారం దక్షిణాధి నగరాల డిమాండ్ క్రమంగా పెరుగుతున్నది. మొత్తంలో వాటాలో మూడోవంతు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నయ్ నగరాలే ఆక్రమించుకున్నాయి. ఈ జాబితాలో ఒకప్పుడు సాధారణంగా బెంగుళూరు, ఢిల్లీ వంటి నగరాలకే ఒకప్పుడు డిమాండ్ ఉండేది. అంటే మెరుగైన మౌలిక వసతులే ఈ రంగంలో వృద్ధి చెందడానికి కారణమని నిపుణులు చెబుతున్నారు. బెంగళూరు, హైదరాబాద్ మరియు చెన్నైలు దాదాపు 5 నుంచి 6 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్ విక్రయాలు జరిగితే ఇందులో కో వర్కింగ్ ప్లేయర్ల వాటా ఏకంగా 30% శాతంగా ఉంది. అదే ముంబై, పుణే నగరాల్లో మాత్రం 24శాతం, నోయిడా(ఎన్‌సీఆర్) పరిధిలో ఆఫీస్ స్పేస్ డిమాండ్‌లో కో వర్కింగ్ స్పేస్ వాటా 32% ఉంది. ఇక అట్టడుగున కోల్ కతా నగరంలో నమోదు కాగా 0.25 చదరపు మిలియన్ అడుగుల ఆఫీస్ స్పేస్ క్రయవిక్రయాల్లో కేవలం 12% మాత్రమే కో వర్కింగ్ స్పేస్ సెగ్మెంట్ విస్తరించి ఉంది.

### విశ్వనగరానికి పుష్కళమైన అవకాశాలు...

గ్లోబల్ సిటీకి ఈ రంగంలో పుష్కళమైన అవకాశాలు వస్తున్నాయి. ఇండస్ట్రీయల్, స్టార్టప్ ఫ్రెండ్లీ విధానాలతో అన్ని మెట్రో నగరాల కంటే పారిశ్రామికంగా హైదరాబాద్ హాట్ కేకులా మారింది. దీంతో దేశ, విదేశీ కంపెనీలు ఇక్కడి నుంచే కార్యాకలాపాలను మొదలుపెడుతున్నాయి. ఇక ఐటీ రంగానికి హార్ట్ ఆఫ్ ద సిటీగా ఉన్న ఐటీ కారిడార్ శరవేగంతో నలువైపుల విస్తరిస్తున్నది. దీనికి ప్రభుత్వం కూడా అవసరమైన వసతులను కల్పిస్తూ కంపెనీలను ప్రోత్సహిస్తుండటంతో నార్త్, సౌత్, వెస్ట్ అనే తేడా లేకుండా కొత్త కంపెనీలు కొలువు దీరుతున్నాయి. ఇక నగరంలో మెయిన్ కమర్షియల్ ఏరియాలను అనుసంధానం చేసేలా విస్తరించిన మెట్రో రైలు, నగరం చుట్టూరా ఉన్నా అవుటర్ రింగు రోడ్డు వంటి ఆధునిక రవాణా సదుపాయాలతో... రాకపోకలు మరింత సులభంగా మారిపోయాయి. ఇలా కో వర్కింగ్ స్పేస్‌కు అనకూలమైన వాతావరణం నగరంలో విస్తరించి ఉంది. ఇక చిన్న, మధ్య తరహా కంపెనీలు కూడా ఆర్థికంగా నిలబడేందుకు ఇదొక అవకాశంగా భావించి స్టార్టప్‌లూ ఇలాంటి కార్యాలయాల నుంచి కార్యాకలాపాలు కొనసాగించడానికి ముందుకు వస్తున్నాయి.



### ఆ కంపెనీలన్నీ కో వర్కింగ్ స్పేస్‌లకే...

నిర్వాహణ భారం, ఖర్చులు తక్కువగా ఉండటంతోనే సొంతంగా ఆఫీసులను ఏర్పాటు చేయడం కంటే కో వర్కింగ్ స్పేస్‌లకు కంపెనీలు ప్రాధాన్యతనిస్తున్నాయి. దీంతోనే ఈ సెగ్మెంట్‌కు ఆదరణ పెరుగుతుందని ఇండస్ట్రీ నిపుణులు భావిస్తున్నారు. దీనికితోడు సాంప్రదాయ వర్కింగ్ స్పేస్ కల్చర్ కంటే వైవిధ్యమైన వర్క్ ఆట్మాస్పియర్‌లో ప్రొడక్టివిటీని పెంచుకునే అవకాశంగా కంపెనీలు భావిస్తున్నాయి. దీంతో పది మంది కలిసి ఇష్టమైన చోట పనిచేసుకునే వెసులుబాటు ఉండే కో వర్కింగ్ స్పేస్‌కు మొగ్గుచూపుతున్నాయి. దీంతో చిన్నా, సాధారణ, మధ్యతరహా కంపెనీలన్నీ ఆర్థిక భారానికి ఆస్కారమే లేని కో వర్కింగ్ స్పేస్‌లకు ఆశ్రయిస్తున్నాయి. ఇలా ఐటీ, ఐటీయేతర కంపెనీలు ఈ విధానానికే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నాయి.

### ఐటీ కారిడార్‌పై తగ్గనున్న ఒత్తిడి

భవిష్యత్ అంచనాలతో ఐటీ కారిడార్‌ను డెవలప్ చేసినప్పటికీ... ఆ తర్వాత వచ్చిన పాలకులు నగరం నలువైపులా ఆఫీసు స్పేస్‌ను అభివృద్ధి చేసేందుకు అంతగా ఆసక్తి చూపలేదు. దీంతో వెస్ట్ కారిడార్‌పై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. అంచనాలకు మించిన కంపెనీలు, అంతకు మించిన స్కై స్ర్కాపర్లు ఆ ప్రాంతం రద్దీగా మారిపోయే ప్రమాదం ఉంది. ఇక కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీలన్నీ కూడా ఐటీ కారిడార్‌ను ఎంచుకుంటే తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా ప్రస్తుతం ఉన్న రోడ్లపై విపరీతమైన వాహనాల రద్దీతో నిత్యం ట్రాఫిక్ సమస్యలను చవిచూడాల్సి వస్తోంది. ఈ క్రమంలో నివాసాలకు సమీపంలో కమర్షియల్ యాక్టివిటీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో కో వర్కింగ్ స్పేస్‌లు అందుబాటులోకి రావడంతో ఉద్యోగులకు ప్రయాణ ఖర్చులు, సమయం ఆదా కావడంతోపాటు రోడ్లపై ట్రాఫిక్ తగ్గిపోతుంది. దీంతోపాటు సిటీ నలువైపులా ఐటీ, ఐటీయేతర కార్యాకలాపాలు మొదలైతే అటు కమర్షియల్ స్పేస్‌తోపాటు రెసిడెన్షియల్ సెగ్మెంట్ కూడా మరింత వేగంతో అభివృద్ధి చెందడానికి ఆస్కారం ఉంటుంది.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
19.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



# అత్యాచారం చేసింది అతడే

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్‌జీ కర్ ఆస్పత్రి వైద్యురాలిపై అత్యాచారం కేసులో కోల్‌కతాలోని సీల్దా కోర్టు శనివారం తీర్పు వెలువరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చింది. అతడికి జనవరి 20న శిక్ష ఖరారు చేయనుంది. ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన జరిగిన 162 రోజుల తర్వాత ఈ కేసులో తీర్పు వచ్చింది. వైద్యురాలిపై సంజయ్‌రాయ్ అత్యాచారం, హత్యకు పాల్పడినట్లు అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అనిర్బన్ దాస్ తెలిపారు. సంజయ్ రాయ్‌పై మోపిన అన్ని అభియోగాలను సీబీఐ నిరూపించినట్లు చెప్పారు. సంజయ్ రాయ్‌కు శిక్ష తప్పదని, బాధితురాలిని అతడు చంపిన తీరుకు యావజ్జీవ కారాగార శిక్ష లేక మరణశిక్ష విధించవచ్చని అన్నారు. సోమవారం శిక్షఖరారు చేస్తామని న్యాయమూర్తి అనిర్బన్ దాస్ పేర్కొన్నారు.భారతీయ న్యాయ సంహితలోని 64, 66, 103/1 సెక్షన్ల కింద దోషి సంజయ్‌రాయ్‌కు కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. ఈ సందర్భంగా కోర్టులో మాట్లాడిన దోషి సంజయ్‌రాయ్, తాను ఈ నేరానికి పాల్పడలేదని తెలిపాడు. ఈ కేసులో తనను తప్పగా ఇరికించారని అన్నాడు. నేరం చేసిన వారిని వదిలేశారని, ఇందులో ఒక ఐపీఎస్ పాత్ర ఉందని తెలిపాడు. సోమవారం శిక్ష ఖరారు సందర్భంగా దోషి సంజయ్‌రాయ్ మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని సీల్దా కోర్టు అదనపు జిల్లా జడ్జి వ్యాఖ్యానించారు.



## శ్రీ సాయి కంటి ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- **శ్రీ సాయి కంటి ఆసుపత్రిని ప్రారంభించిన ఎఎస్పీ నాగేశ్వర్రావు, ఆర్డీఓ వేణు మాదవ్**

**సూర్యాపేట, విశాలభారతి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో అపారమైన అనుభవం కలిగిన డాక్టర్ సల్వాది రమేష్ కుమార్ సారధ్యంలో నూతనంగా హైటెక్ బస్టాండ్ సమీపంలో శ్రీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి కంటి ఆసుపత్రి సేవలను సూర్యాపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎఎస్పీ నాగేశ్వర్రావు, ఆర్డీఓ వేణుమాదవ్ లు అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని హైటెక్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ సాయి కంటి ఆసుపత్రిని వారు ప్రారంభించి మాట్లాడారు. నిర్వాహకులు డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ తన అనుభవంలో 18వేల ఆపరేషన్లు చేసి ఎన్నో అవార్డులు అందుకున్నారని గుర్తు చేశారు. పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఈ ఆసుపత్రిని ప్రారంభించామని, ప్రతి రోజు పేదలకు ఉచితంగా కంటి, రెటినా పరీక్షలు చేస్తానన్నారు. అనంతరం నిరు పేదలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సల్వాది భావన విక్రమాదిత్య, సాయిరాం, చీదెటి వెంకట రెడ్డి, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.ఎస్.ఆర్.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

- **డిఎస్పీ రవీంద్రరెడ్డి**

**మణుగూరు, విశాలభారతి:** రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగాజిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల ప్రకారం శనివారం ఎస్ డిపిఓ మణుగూరు రవీంద్ర రెడ్డి ఆధ్వర్యంలో మణుగూరు ప్రకాశవని ఓకే 2 నందు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని




వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి అదేవిధంగా తమ వెహికల్ కి ఇన్సూరెన్స్ తీసుకొని ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు మరియు అతివేగంగా అజాగ్రత్తగా సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని తెలిపారు. వాహనాలు నడిపినప్పుడు అందరూ సీట్ బెల్ట్ ధరించాలి ప్రతి ఒక్కరూ కుటుంబం పట్ల సమాజం పట్ల బాధ్యతగా ఉండి డ్రైవింగ్ చేయాలి తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్ఐ ప్రసాద్ ఏం.వి.ఐ పుల్లయ్య, జి ఏం శ్యాంసుందర్, ఓ సి2 ప్రాజెక్టు మేనేజర్ రాంబాబు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## పాలకమండలిని సన్మానించిన ఆలయ అర్చకులు

- **బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడంలో కీలకపాత్ర**

**భీమదేవరపల్లి, విశాలభారతి:** వీరభద్ర స్వామి సమేత భద్రకాళిదేవి కోవెల కొత్తకొండ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడంలో పాలకమండలి పాత్ర అమూల్యమైనదని ఆలయ అర్చకులు అన్నారు. రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధతో కొత్తకొండ బ్రహ్మోత్సవాలు జరగాలని ప్రభుత్వ పరంగా సేవలు అందించుటకు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉత్తర్వుల ద్వారా ధర్మకర్తలుగా ఆలయ చరిత్రలో మొట్టమొదటిసారి వివిధ ప్రాంతాల నుంచి పాలకమండలి సభ్యులను నియమించారు. బ్రహ్మోత్సవాలు శనివారం ముగియనుండడంతో పాలకమండలి చైర్మన్ చంద్రశేఖర్ గుప్తతో పాటు, ధర్మకర్తలు కొంగోండ సమ్మయ్య, కురుమళ్ల మంజుల, గనబోయిన కొమురయ్య, బత్తిని శ్రీనివాస్, గుగులోత్ రాజు నాయక్, పెండ్యాల తిరుపతి, పోలు సంపత్, తల్లం విక్రం, బానోత్ కిషన్ నాయక్, బోయినపల్లి ఉమాపతిరావు, దామెరుప్పుల కోటేశ్వర్, కందూరు దేవేందర్ రెడ్డి, ఆనుకోటి నాగరాజు లను ఆలయ ఈవో పి. కిషన్ రావు శాలువాతో ఘనంగా సన్మానించి, స్వామి వారి యొక్క ప్రసాదం, చిత్రపటం అందరికీ ఇచ్చి దేవాలయ అర్చకులు ఘనంగా వేద ఆశీర్వాదములు అందించారు.

## వాసవి డిస్ట్రిక్ట్ పి ఆర్ ఓ గా అరుణ కుమారి

**నేరేడుచర్ల, విశాలభారతి:** వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గా నేరేడుచర్ల కు చెందిన గరిణె అరుణకుమారి నియమితులయ్యారు. అరుణకుమారి గతంలో 201415 సంవత్సరంలో నేరేడుచర్ల వనితా క్లబ్ చార్టర్ కార్యదర్శిగా, 2016 సంవత్సరంలో వనితా క్లబ్ అధ్యక్షురాలిగా, 2017 సంవత్సరంలో జోన్ చైర్మన్ గా , 2018 సంవత్సరంలో రీజియన్ చైర్మన్ గా,2020 నుండి 2024 వరకు ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ గా పనిచేశారు. ఉత్తమ వనితకుల అధ్యక్షురాలుగా, ఉత్తమ రీజియన్ చైర్మన్ గా ఎంపికై అవార్డులను అందుకున్నారు. ఆమె వాసవి వనిత క్లబ్ లకు



చేసిన సేవలను గుర్తించి జిల్లా పిఆర్ఓగా, గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి నియమించారు. ఆమె నియామకం పట్ల స్థానిక వాసవి వనిత క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



## తెలుగోడి గుండెల్లో గుడి కట్టుకున్న మహనీయుడు ఎన్టీఆర్

- **దేప శ్యాంసుందర్ ముదిరాజ్**
- **ఎన్టీఆర్ యువసేన నాయకులు**

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని దండు మార్కాపురం గ్రామంలో స్వర్గీయ నందమూరి తారకరామారావు గారి 29 వ వర్దంతి పురస్కరించుకుని నందమూరి యువసేన నాయకులు మాజీ వార్డు మెంబర్ దేప శ్యాం సుందర్ ముదిరాజ్ తన నివాసంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుజాతికి, తెలుగుభాషకు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి తెలుగువారి ఆత్మగౌరవం,కోసం కృషి చేసిన మహనీయులు ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు ప్రభంజనం అని,వెండితెరపై రారాజుగా వెలుగొందారు, మహానాయకుడిగా రాణించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిలివేరు బిక్షపతి ,రాచర్ల ఈశ్వర్,గుండ్ల లింగస్వామి, సత్యబోయిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**చౌటుప్పల్, విశాలభారతి:** మునుగోడు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్ పుట్టినరోజు సందర్భంగా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ మల్లికార్జున,భ్రమరాంబికా దేవి శివవాలయంలో చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల విప్లవ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించి,శివ స్వాములకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు మోగదాల రమేష్ గౌడ్, యువజన నాయకులు తూర్పున రవి గౌడ్, మలిగే మల్లేష్ గౌడ్, బొబ్బలి రాజేందర్, పబ్బు శ్రీకాంత్, లింగస్వామి, నాగరాజు గౌడ్, మహేష్, బాలగోని శ్రీకాంత్, సాయి, శ్రీశైలం పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- **మధుయాష్కీ గౌడ్**

**ఎల్బీ నగర్ విశాలభారతి :** సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. వివిధ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు మధుయాష్కీ గారిని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. సదరు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. ఎల్బీనగర్ సద్గురు నగర్ కు చెందిన కె. కైలాష్ రూ.60వేలు , వనస్థలిపురం శ్రీరామ్ నగర్ కాలనీ చెందిన శక్తి రోహన్ కు రూ. 40 వేల 500 , హయత్ నగర్ కు చెందిన షేక్ అశ్వక్ రూ.25 వేలు , వనస్థలిపురం కు చెందిన లక్ష్మమ్మ కు రూ. 60 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుట్ల నరసింహ యాదవ్, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదివాసి మహా ధర్నాను జయప్రదం చేయండి

**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. 20 జనవరి 2025 నా ఏటూరు నాగారం ఐటిడిఏ ముందు ఆదివాసి సమస్యలను పరిష్కరించుటకై ర్యాలీ, మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు ఉయిక శంకర్,ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ , ఏటూరు నాగారం డివిజన్ అధ్యక్షులు టింగ భుచ్చయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఐదో ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలు 1/70 చట్టం అటువై హక్కుల చట్టం ఫేస్ చట్టాలు వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు, పాలకులకు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాలను నిర్వీర్యం చేస్తూ ఏజెన్సీలో గిరిజనేతరులకు అన్ని విధాలుగా హక్కులు కల్పిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల నాయకులు తుర్స కృష్ణ బాబు, లోడిగ నరసింహరావు, తాటి రాంబాబు, గడల మహేష్, గొర్రె మనోజ్, ధర్మతేజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలు

**కూకట్ పల్లి,విశాలభారతి:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి విశ్వ విఖ్యాత నటసార్వభౌమ డాక్టర్ నందమూరి తారక రామారావు పేరు తెలుగు నేలపై నిలిచే ఉంటుందని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం కూకట్పల్లి నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ఆయన అభిమానులు వాడ వాడల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.నియోజకవర్గ పరిధి వసంత నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తి పతాక తెలుగుజాతి వెలుగు రేఖ నందమూరి తారక రామారావు అని దేశ దేశాలలో ఆయన తెలుగువారికి ఒంటి చేత్తో ఘన కీర్తిని సాధించి పెట్టారని కొనియాడారు.పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి పెద్దపీట వేసిన మహానుభావుడన్నారు. అటు నటనలోనూ ఇటు రాజకీయల్లో చెరగని ముద్ర వేసి నేటి యువతకు ఎన్టీ రామారావు ఆదర్శప్రాయం అన్నారు. అనంతరం నిజాంపేట్ రోడ్ త్రివేణి నగర్ చౌరస్తాలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు టిడిపి జనార్ధన్ మరియు శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ తో కలిసి బండి రమేష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదానం చేసిన వారికి ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున సర్టిఫికెట్స్ ప్రధానం చేసి అన్న అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



## క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వేం నరేందర్

**విశాలభారతి, కూకట్పల్లి:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి చేతుల మీదుగా కేపీహెచ్బీ కల్చర్,వెల్ఫేర్ &స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శేరి సతీష్ రెడ్డిని అభినందిచారు. ఈ సందర్భంగా వేం నరేందర్ మాట్లాడుతూ క్రీడాకారులు,క్రీడలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని వారికి కావలసిన అన్ని సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.సంజీవ రావు, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ పి నాగిరెడ్డి ,బి బ్లాక్ ప్రెసిడెంట్ తుమ్మ వేణు,అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్ , కెపిహెచ్బి డివిజన్ ప్రెసిడెంట్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, నరసింహ,కొండల్ రెడ్డి, రేష్మ, కుమ్మ బాబూ, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# కామెరూన్ దేశస్థుడి అరెస్ట్

- **హయత్నగర్లో నకిలీ కరెన్సీతో మోసం.**

**ఎల్బీ నగర్ ,విశాలభారతి:** నకిలీ కరెన్సీతో అమాయకులను మోసం చేస్తున్న కామెరూన్ దేశస్థుడిని శనివారం హయత్నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కామెరూన్ దేశానికి చెందిన జాక్వెస్ డివొలిస్ కిట్ హయత్నగర్లోని చైత్రలాడ్జిలో దిగాడు. అసలైన నోట్లు రూ. 5 లక్షలు ఇస్తే రూ. 10 లక్షల ఫేక్ కరెన్సీ ఇస్తానని చెప్పగా.. రసూల్ అనే వ్యక్తి అతని వలలో పడ్డాడు. రసూల్ నుంచి అసలు కరెన్సీ తీసుకుని.. ఫేక్ కరెన్సీ ఇస్తుండగా.. అప్పటికే పక్కా సమాచారంతో మాటు వేసిన పోలీసులు రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. నిందితుడు గతంలో బెంగళూరులో కూడా ఫేక్ కరెన్సీ కేసులో అరెస్టయినట్లు, ఫేక్ పాస్పోర్టుతో తిరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
19.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





## వీరభద్ర స్వామి సన్నిధిలో బిఆర్ఎస్ నాయకులు

**భీమదేవరపల్లి, విశాలభారతి:**

కొత్తకొండ వీరభద్రుడి సన్నిధిలో బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, హన్మకొండ మాజీ జెడ్పీ చైర్మన్ డాక్టర్ మారేపెల్లి సుధీర్ కుమార్ స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఈవో కిషన్ రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్త ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఒక ఆధ్యాత్మిక శోభ నెలకొందనని, ప్రతీ సంవత్సరం సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆత్మీయులతో కలిసి వీరభద్ర స్వామిని దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించి, ఏడాది పాటు పాడిపంటలు బాగుండాలని వేడుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సురేందర్, మాజీ జడ్పీటీసీ వంగ రవి, మాజీ ఎంపీపీ లు జక్కుల అనితారమేష్ పాల్గొన్నారు.

## పెద్దగట్టు అభివృద్ధికి కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్**

**సూర్యాపేట, విశాలభారతి:**

తెలంగాణలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుందిన శ్రీ శ్రీ లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతర అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. నూతనంగా ఎన్నికైన గుట్ట పాలకవర్గం సభ్యులు, చైర్మన్ పోలబోయిన నరసయ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ ను ఆయన చాంబర్ మర్యాదపూర్వకంగా కలిశారు.







## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి:**

పటాన్ చెరు నియోజకవర్గం రామచంద్రపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. డివిజన్ పరిధిలోని ఫెన్సింగ్ ఏరియాకు చెందిన రామకృష్ణ కు 20,000, మాధవికి 24,000, ఎంఐజి కాలనీకి చెందిన చందుకు 60,000 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వీటిని కార్పొరేటర్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సహకారంతో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరైనట్టు తెలిపారు.

**డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి..**

భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీ వాసులు కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కార్పొరేటర్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. ప్రధానంగా డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఇందుకు స్పందించిన కార్పొరేటర్ సింధు త్వరలో కాలనీలో అధికారులతో పర్యటించి, సమస్య పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సర్కిల్ యూత్ అధ్యక్షుడు నరసింహ, జైపాల్, మ్యాక్ సొసైటీ కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మైసిగండి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు

- **ఎమ్మెల్యే కసిరెడ్డి**

**ఆమనగల్లు,విశాలభారతి:**

రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. శనివారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా దేవాలయంలో మైసమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకముందు వేద పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించి, అమలు చేస్తామన్నారు. అందుకోసం రూ.5 కోట్లు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా ఆయన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్, గూడూరుశ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు బిచ్య నాయక్, నాయకులు జక్కు అనంతరెడ్డి, హీరాసింగ్, ఇమ్రాన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

**ఆమనగల్లు, విశాలభారతి:**

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. లయన్ పసుల లక్ష్మారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గస్థాయిలో లైన్స్ క్లబ్ చేసే సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. స్వచ్ఛంద సంస్థలకే లైన్స్ క్లబ్ ఆమనగల్లు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు శిబిరాలు నిర్వహించి వారికి ఉచితంగా సేవలు అందించడం గొప్ప విషయం అని అన్నారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి యాక్సిడెంట్ అయినవారికి రక్తం కావలసిన అవసరం ఉన్నవారికి ఇప్పించడం ఆపదలో ఉన్నవారికి అందించడం గొప్ప సేవ అన్నారు. మానవసేవయే మాధవసేవా అని ఆయన పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు సీజనల్ వ్యాధులు దరిచేరకుండా ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహించి సేవలందించడం మహా గొప్ప విషయమని కొనియాడారు. రక్తదాన శిబిరంలో రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన యువతీ యువకులను ఆయన అభినందించారు. ఈ శిబిరంలో 42 మంది రక్తదానం చేసినట్లు క్లబ్ పిఆర్ఓ ఎంఏ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ పసుల లక్ష్మారెడ్డి, జిల్లా చైర్మన్ ఎం అంజయ్య, ఓంకారము, సభ్యులు వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, రక్తదాత పి అంజిరెడ్డి, టిపిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## పేటలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీ

- **ఇద్దరు మృతి,ఐదుగురికి గాయాలు.**
- **కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన సీఐ వీర రాఘవులు**

**సూర్యాపేట, విశాలభారతి**

అర్ధరాత్రి హైద్రాబాద్ విజయవాడ జాతీయ రహదారి ఎన్ హెచ్ 65 పై సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కాలెజి మూల మలుపు వద్ద రోడ్డు ప్రమాదం ముందు వెళ్తున్న ప్రైవేట్ బస్సుని వెనుక నుండి ఢీ కొట్టిన మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ఇద్దరు మృతి, ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే సూర్యాపేట ఎస్వీ ఇంజనీరింగ్ కాలేజి మలుపు వద్ద శనివారం గుంటూరు నుండి హైద్రాబాద్ వెళ్తున్న యోలో ట్రావెల్స్ బస్సు స్పీడ్ బ్రేకర్స్ ఉండటంతో బ్రేక్ వేసి నెమ్మదిగా వెళ్తుండగా వెనుక నుండి వేగంగా వచ్చిన జింగ్ ట్రావెల్స్ ప్లస్ బస్సు బలంగా ఢీ కొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. దీంతో జింగ్ ట్రావెల్స్ బస్సు ముందు అద్దం పగిలి అక్కడే ఉన్న బస్సు క్లినర్ సాయి ప్రమాద ధాటికి బయటికి ఎగిరి బస్సు ముందుకు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళ్తున్న యోలో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న పాషా అనే ప్రయాణీకుడు ప్రమాద కుదుపుకి గుండెపోటుతో మరణించగా మొత్తంగా ఐదుగురు ప్రయాణీకులు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న సూర్యాపేట పట్టణ పోలీసులు మృతులను, క్షతగాత్రులను సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అడ్డంగా ఉన్న బస్సును తొలగించి యధావిధిగా వాహనాలు ప్రయాణించేలా చర్యలు చేపట్టారు.యోలో బస్సు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వీర రాఘవులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



## ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

- **టీడీపీ మండలాధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు**

**పినపాక, విశాలభారతి:**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను టిడిపి మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. శనివారం మండలం కేంద్రంలో జరిగిన వర్ధంతి వేడుకల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మాభిమానానికి నిలువెత్తు రూపంగా నిలిచి, ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారి ఔన్నతిని చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొంపెల్లి నాగేశ్వరరావు, కొడిరెక్కల సత్యం, వీర మోహన్ రావు, రాయపురెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం డబ్బులు అందించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

**ఆమనగల్లు, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం వడ్లు పండించిన రైతన్నలకు ప్రోత్సాహకంగా రూ. 500 బోనస్ రైతుల ఖాతాలో జమ చేస్తామని ఇప్పటివరకు జమ చేయడం లేదని ఈ విషయమై ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు గంప వెంకటేష్ గుప్తా తెలిపారు. శనివారం ఆమెను కలిసిన సందర్భంగా ఇక్కడి రైతుల ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అదే విధంగా వరి ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వంపై ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ తరపున ఒత్తిడి తేవాలని ఆమెను కలిసి మాట్లాడినట్లు వెంకటేష్ గుప్తా వివరించారు. ఆయన వెంట నాయకులు ఉపేందర్, శివ, రాకేష్ తదితరులు ఉన్నారు.



## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

**ఆమనగల్లు, విశాలభారతి:**

క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఆమనగల్లు మండల సామాజిక వేత్త న్యాలపట్ల నరేందర్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండంలోని ఆకుతోటపల్లి గ్రామంలో ఆకుతోటపల్లి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆకుతోటపల్లి ప్రీమియర్ లీగ్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్నును ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సామాజికవేత్త న్యాలపట్ల నరేందర్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా న్యాలపట్ల నరేందర్ క్రికెట్ జెర్సీని క్రీడాకారులకు అందజేశారు. అనంతరం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి, మొదటి బహుమతి ప్రైజ్ రూ.20,000 ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,మాల్ టీంకు రెండవ బహుమతి రూ.10,000, ట్రోఫీలను నరేందర్ రెడ్డి అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే క్రికెట్ టోర్నమెంట్ను క్రీడాకారులు వినియోగించుకొని, రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, ఆకుతోటపల్లి గ్రామం నుండి ఉత్తమమైన క్రీడాకారులు తయారవ్వాలని క్రీడాకారులకు ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు అండేకర్ రాజశేఖర్, బొల్లు నరేందర్, సుధాకర్ రెడ్డి, రాంచందయ్య, మల్లేష్ , సాజిద్, మహేష్, రమేష్,ఖాజాం, వెంకటేష్, బన్నీ, శివ,సమీర్, సాయి, బాలు,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

**చౌటుప్పల్, విశాలభారతి:**



పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అభిమానులు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రతి ఒక్కరూ పురపాలక సంఘం కార్మికునివలే ఉండాలనే ఆలోచనతో అందరికీ దుస్తులు పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండమీది మల్లేష్, అంతటి విజయ బాలరాజు, పోలోజు వనజా అనిల్, కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, దండ హిమబిందు అరుణ్, బుడిగే అరుణ బాలకృష్ణ, తాండూరు శిరీష పరమేష్, చందగల విజయ సతీష్, ఉబ్బు వరమ్మ వెంకటయ్య, గోపగోని లక్ష్మణ్, కామిశెట్టి శైలజ భాస్కర్, ఎండి భాబా షరీఫ్, వివిధ పార్టీ రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు,యువజన సంఘాలు, మహిళా సంఘాలు, పారిశుద్ధ కార్మికులు, పురపాలక సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఆదివారం,
19.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# పోలీస్ లకు క్రీడా పోటీలు

**సూర్యాపేట, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2025 సందర్భంగా వివిధ క్రీడల్లో జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించాల్సిన పోలీసు క్రీడాకారుల ఎంపిక లో భాగంగా జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్ నందు మెన్ అండ్ ఉమెన్ పోలీసు క్రీడాకారుల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలో భాగంగా వాలీబాల్, కబడ్డీ, హై జెంప్, లాంగ్ జంప్, హై జంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షార్ట్ పుట్, కోకో, బ్యాట్మెటేన్, వివిధ పరుగు పందెం క్రీడల్లో జిల్లా జట్లను ఎంపిక చేసినారు. జిల్లా జట్లుగా ఎంపిక కాబడిన నల్గొండ, సూర్యాపేట జిల్లాల పోలీసు క్రీడాకారుల కు పోటీలు నిర్వహించి 5వ జోనల్ పోలీసు జట్ల ఎంపిక చేస్తారు. 5వ జోనల్ పోలీసు క్రీడాకారుల ఎంపిక కోసం 20వ తేదీ సోమవారం రోజున సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఎంపిక పోటీలు నిర్వహిస్తారు.ఎస్పి గారి ఆదేశాల మేరకు ఎ ఆర్ అదనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, డి ఈవో అశోక్, ఎ ఆర్ డీఎస్పీ నరసింహ చారి, ప్రభుత్వ పాఠశాలల పిఈటి లు ఎంపిక ను పర్యవేక్షణ చేసినారు. ఆర్ ఐ నరసింహ, ఆర్ ఎస్ ఐ లు రాజశేఖర్, సురేష్, ఎమ్.అశోక్, కే.అశోక్, సాయిరాం, సిబ్బంది ఉన్నారు.

## వీరభద్రున్ని దర్శించుకున్న కడియం శ్రీహరి



**భీమదేవరపల్లి, విశాలభారతి:**

కొత్తకొండ వీరభద్రుడి సన్నిధిలో మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్థానిక నాయకులతో కలిసి కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కంచనపల్లి రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, వినయ్ శర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షిణలు చేపించారు. ఈవో కిషన్ రావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ గుప్త ఘనంగా స్వాగతం పలికి పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.





# పురపాలికల అభివృద్ధిపై సమీక్షించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- 21, 22, 23 తేదీలలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

**పటాన్ చెరు,విశాలభారతి:**

పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని బొల్లారం, తెల్లాపూర్, అమీన్ పూర్ మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 21, 22, 23 తేదీలలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం పటాన్ చెరు పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, కమిషనర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెలాఖరులో మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగియనున్న నేపథ్యంలో.. పూర్తిచేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడంతో పాటు.. నూతన పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు. వీటితోపాటు జల మండలి ద్వారా చేపట్టిన నూతన రిజర్వాయర్లను ప్రారంభించడంతో పాటు ఇంటింటికి రక్షిత మంచినీరు పంపిణీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, జలమండలి జిఎం సుబ్బారాయుడు, అధికారులు పాల్గొన్నారు.

**సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్..**

ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డి పేటకు చెందిన సందీప్ కుమార్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్యం కోసం మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా సందీప్ కుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్ పాల్గొన్నారు.



## కొత్తకొండ బ్రహ్మోత్సవాల్లో

# పోలీస్ సేవలు అద్వితీయం

- శాంతియుత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు
- 500 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు - సిఐ పులి రమేష్
- పంచాయతీ రాజ్, విద్యుత్, వైద్య శాఖల సేవలు బేష్.

**భీమదేవరపల్లి, విశాలభారతి:**

తెలంగాణలో ప్రసిద్ధి చెందిన మండలంలోని కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల లో పలు శాఖల సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. కొత్తకొండ దేవస్థానం బ్రహ్మోత్సవాలలో ఎంపీడీవో వీరేశం, ఎంపీ ఓ నాగరాజ్ నేతృత్వంలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, వేలేర్ మండలాల 46 గ్రామ పంచాయతీ కార్యదర్శులు, 146 గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, 37 మంది కారోబార్లు, డి ఎల్ పి ఓ, ముగ్గురు ఎంపీఓలు,11 ట్రాక్టర్స్, ఎనిమిది ట్రాలీలు, బ్రహ్మోత్సవాల లో పాలుపంచుకున్నారు. కాజీపేట ఏసీపి తిరుమల్ ఆధ్వర్యంలో ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, వంగర ఎస్ఐ దివ్య, దాదాపు 500 పోలీసు సిబ్బంది జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసి తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.



# అర్హులందరికీ రేషన్ కార్డు ఇవ్వాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**నాచారం,విశాలభారతి:**

సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్ కార్డ్ లబ్ధిదారుల సర్వేను,క్షేత్ర స్థాయిలో జరుగుతున్న రేషన్ కార్డ్ దరఖాస్తుల కార్యక్రమంలో ఆకస్మికంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైనా ప్రతి ఒక్క దరఖాస్తు దారునికి రేషన్ కార్డ్ లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిహెచ్ఎంసి బిల్ కలెక్టర్ ముఖేష్, స్థానిక నాయకులు నెమలి రవి, తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ధర్మరాజు, శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్, పరమేష్ రెడ్డి, గణేష్, శ్రీశైలం, రాపోలు శ్రీనివాస్, మెండ రఘు, శశి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



# చెప్యాల మరణం తీరనిలోటు

**భీమదేవరపల్లి, విశాలభారతి:**

ప్రశ్నించే గొంతుక మూగబోయిందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుడు చెప్యాల ప్రభాకర్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా శనివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమతో పాటుగా అనేక పోరాటాలలో తన వంతు సహకారం అందించిన మహానేత చనిపోవడం బాధాకరం అన్నారు. ఆయన లేని లోటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు , హనుమకొండ జిల్లాకు తీరని లోటని వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గడిపే మల్లేష్, నాయకురాలు గూడెం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# మారుమోగిన వీరభద్ర నామం

**భీమదేవరపల్లి, విశాలభారతి:**

కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అగ్నిగుండాల్లో భారీగా భక్తజనం పాల్గొని విజయవంతం చేశారు. శనివారం ఉదయం అగ్గి గుండముల పర్యవేక్షకుడు బంగిమటం పరమేశ్వరయ్య నేతృత్వంలో అగ్నిగుండాలు దిగ్విజయంగా పూర్తయ్యాయి. ఈ సందర్భంగా పరమేశ్వరయ్య మాట్లాడుతూ శివుని జటాజూటం నుండి వీరభద్రుని ఆవిర్భావం, దక్షయజ్ఞంకి ప్రతిరూపం అగ్ని గుండాలు అని, ఈ కార్యక్రమంలో అష్టభైరవారాధన ప్రధానం వీరభద్ర స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైనదని తెలిపారు. అగ్నిగుండాలతో వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. జై వీరభద్ర, శరభ శరభ అని స్మరిస్తూ.. ఎర్రగా దగడగలాడే నిప్పుల్లో నడిచిన భక్తులు వారి భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. సామాన్య భక్తులతో పాటు, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ గుప్త, సీఐ పులి రమేష్, ఎస్సై సాయిబాబు కూడా అదే నిప్పుల్లో నడిచి భక్తిని చాటుకున్నారు. అగ్గిగుండాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పులి రమేష్, ఎస్ఐ సాయిబాబు నేతృత్వంలో పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపప్రధాన అర్చకులు కంచనపల్లి రాజయ్య, ముఖ్యఅర్చకులు మొగిలిపాలెం రాంబాబు, వీరబద్రీయులు మహేష్ , తిరుపతి, రమేష్, రవి, ఆలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పాత్రికేయులు, భక్తులు నడిచి భక్తిని చాటుకున్నారు.



## ఘనంగా రంగనాథ స్వామి

# కళ్యాణ మహోత్సవం

**సూర్యాపేట, విశాలభారతి:**

జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ నందు వేదాంత భజన మందిరంలో శనివారం గోదాదేవి రంగనాథ స్వామి కళ్యాణం, సీతారామచంద్ర మాస కళ్యాణ, మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోదాదేవి రంగనాథ కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం, స్వామివారికి పట్టు వస్త్రాలు దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సమర్పించారు. వేద మంత్రోచ్ఛరణలు, సాంప్రదాయ పద్ధతిలో శాస్త్రోస్తకంగా దేవాలయ అర్చకులు ధరూరి సింగరాచార్యులు, రాఘవాచార్యులు, రామానుజా చార్యులు, ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వేదాంత భజన మందిరం దేవాలయ కమిటీ అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి నకిరేకంటి నాగరాజు, కోశాధికారి సోమ అశోక్, సోమ సుమన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపటి సురేష్, బోనగిరి వెంకటేశ్వర్లు, శంకర్, దంతాల సందీప్, అంతటి వెంకటేష్, వీరవెల్లి రామ్మూర్తి, ఓరుగంటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.




## గణతంత్ర దినోత్సవ వేడుకల

# ఏర్పాట్లు పూర్తి చేయాలి

- ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, విశాలభారతి:**

76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం ఐడిఓసి ప్రదాన సమావేశ మందిరం నందు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 76వ గణతంత్ర వేడుకలను స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు నిర్వహించుటకు అధికారులు ముందు ప్రణాళికలు రూపొందించుకొని సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల పై స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులతో సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, అధికారులకు, సిబ్బందికి ఉత్తమ ప్రశంసా పత్రాలు ఇచ్చుటకు గాను సంబంధిత శాఖాధిపతులు తమ సిబ్బంది పేర్లను 21తేది కల్లా పంపించాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయుచున్న 6 గ్యారంటీ పథకాల ప్రచారంపై శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని,సంస్కృతికకార్యక్రమాలు నిర్వహించాలని, మున్సిపల్ శాఖ త్రాగునీరు, శానిటేషన్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్ పి జనార్దన్ రెడ్డి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

ఆదివారం,
19.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com




## నెల్లికంటి పార్వతమ్మకు ఘన నివాళులు



మునుగోడు, విశాలభారతి: ఎలగల గూడెం గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ మృతి చెందారు విషయం తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ శనివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శరత్ బాబు, బందారు శ్రీనివాస్, మల్లారెడ్డిగూడెం ఎంపీటీసీ నర్రి నరసి, సురిగి చలపతి బందారు శంకర్ తిరందా శ్రీనివాస్ తీర్పారి వెంకన్న ఈదుల కంటి కైలాసం పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ వ్యక్తి కాదు..శక్తి

- టీడీపీ నేత కరికే సత్యనారాయణ
- ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు
- ఘన నివాళులర్పించిన టిడిపి నేతలు

పటాన్ చెరు,విశాలభారతి

నందమూరి తారక రామారావు(ఎన్టీ ఆర్) వ్యక్తి కాదని శక్తి అని టిడిపి నేత కరికే సత్యనారాయణ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ, బీరంగూడ, పటాన్ చెరు, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహానికి పూలమాలలు వేసి టిడిపి నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరికే సత్యనారాయణ మాట్లాడుతూ నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అంటూ జనం హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న మహా మనిషి అని అన్నారు. అశోక్ కుమార్, వినోద్, ఆకుల కృష్ణ గౌడ్, బీవీ రావు, ఎండీ.రఫీక్, ఎండీ. నయీం, ఎండీ. నజీర్,ధర్మ రావు, సురేష్,నరేష్,రామచంద్రయ్య యాదవ్, ఎన్.రాము,వీ.సాయిలు,నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# ఓయో రూమ్ కేంద్రంగా గంజాయి విక్రయాలు

- పక్కా సమాచారంతో ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు దాడి
- హనిందితుల వద్ద 3.5 కేజీల గంజాయి స్వాధీనం



శేరిలింగంపల్లి,విశాలభారతి: ఓయో రూమ్ కేంద్రంగా గంజాయి విక్రయాలు జరుపుతున్న ఇద్దరిని ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే ఏపీ లోని నెల్లూరు జిల్లా కావలికి చెందిన రాజు (25), మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సంజన (18) స్నేహితులు.కాగా వీరు ఇరువురు వేరువేరుగా గంజాయి,డ్రగ్స్ విక్రయిస్తుండేవారు. ఈ నేపథ్యంలో సంజన, రాజులు ఇద్దరూ కలిసి గంజాయి విక్రయించేందుకు పథకం పన్నారు. అందులో భాగంగా గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధి లోని కొండాపూర్ లో గల ఓయో రూమ్ బుక్ చేసుకుని గత కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తూ వస్తున్నారు .ఈ మేరకు పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి కొండాపూర్ లోని ఓయో రూంపై దాడి చేసి రాజు,సంజనలను అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం జిల్లా అరుకు వివిధ ప్రాంతాల నుండి గంజాయి తీసుకొచ్చి ఓయో రూమ్ లో ఉంటూ విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు.వారి వద్ద నుండి 3.625 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్ డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.




# తెలుగుజాతి ఇలవేల్పు ఎన్టీఆర్

- కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

శేరిలింగంపల్లి,విశాలభారతి: అఖండ తెలుగుజాతికి ఇలవేల్పు,తెలుగు వారి ఆత్మగౌరవం,స్వర్గీయ నందమూరి తారక రామారావు అని మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ,నటరత్న, పద్మ శ్రీ, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని జయప్రకాష్ నారాయణ నగర్ కాలనీలో స్థానికులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడన్నారు. అన్న అనే పదానికి మారుపేరు,సమాజమే దేవాలయం,ప్రజలే దేవుళ్లు అని భావించి ప్రజా సంక్షేమానికి సరికొత్త అర్థం చెప్పిన మహానుభావుడు నందమూరి తారకరామారావు అని, తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఎంతో మందికి ఆయన స్ఫూర్తి ప్రదాత అని, రాజకీయాలకు నూతన నిర్వచనం ఇచ్చి, కోట్లాది ప్రజల జీవితాలలో వెలుగు నింపిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. మరణం లేని జననం,తెలుగువాడి కీర్తిని నలుదిశలా ప్రపంచ వ్యాప్తంగా చాటిచెప్పిన యుగపురుషుడు ఎన్టీఆర్ అని ఆయనకు మరెవరూ సాటి లేరని తెలిపారు. ఈకార్యక్రమంలో కృష్ణంరాజు, జనార్ధన్ రావు,బలరాం,ఎస్ఆర్ వెంకటేశ్వరావు,సూర్యదేవర శ్రీనివాస్,చిలుకూరి శ్రీనివాస్, రమేష్,నరేంద్ర ,కిరణ్, జితేంద్ర, బాబు రెడ్డి,రవి రెడ్డి,జగదీష్ రెడ్డి,రామారావు,నందమూరి అభిమానులు,నాయకులు, కార్యకర్తలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.



# పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్
- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి

పేదల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పేదలు అవస్థలు పడకుండా మెరుగైన వైద్యం చేయించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా చేయూతనందిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గౌడ్, పీ.నరేందర్ రెడ్డి, శివానందం, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలి

- సీబీఎన్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ,వర్ధంతి

సికింద్రాబాద్, విశాలభారతి: సామాజిక న్యాయనికి ఆద్యుడు, వెండితెర రారాజు, మాజీ ముఖ్యమంత్రి ,తెదేపా వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 29వ, వర్ధంతిని శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీహెచ్డీ స్టూడెంట్ తలారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్న వర్గాలకు ,యువకులు రాజకీయ అవకాశాలు కల్పించిన గొప్ప రాజనీతిజ్ఞుడు అంటు కొనియాడారు.పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి , రూ 2 రూపాయలకి కిలో బియ్యం , పేద విద్యార్థుల ఉచిత మధ్యాహ్నం భోజన పథకం తీసుకు వచ్చిన సంక్షేమ స్వప్నికుడు అన్నారు.కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా ఎన్టీఆర్ కు భారత రత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మహేష్ ,రాము, సాయి,సింధు,వినయ్, మహేష్ ,ప్రశాంత్, ప్రాణీత్ ,తాన్వేష్ , విష్ణు ,మహేష్ ,రాకేశ్, రాము,విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉస్మాన్ నగర్ రైతుల సమస్య పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు (రామచంద్రపురం), విశాలభారతి

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్ రేడియల్ రోడ్డులో భూమిని కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉస్మాన్ నగర్ వార్డు కార్యాలయంలో రైతులు, హెచ్ఎండిఏ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ ఎదుర్కొంటున్న సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పరిహారం అందిస్తే భూమిని ఇచ్చేందుకు ఎటువంటి అభ్యంతరం లేదని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. శర వేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ఉస్మాన్ నగర్ నుండి వట్టినాగుల పల్లి వరకు నిరూపించిన రేడియల్ రోడ్డు అత్యంత కీలకమని తెలిపారు. ఉస్మాన్ నగర్ పరిధిలో కొంతమంది రైతులు భూమి ఇవ్వకపోవడం మూలంగా రోడ్డు పనులు నిలిచిపోయాయని తెలిపారు. భూమి కోల్పోతున్న ప్రతి రైతుకు ప్రభుత్వంతో చర్చించి మెరుగైన టిడిఆర్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందుకు స్పందించిన రైతులు భూములు అందించేందుకు సమ్మతించారు. రైతులను కాపాడుకునే పూర్తి బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హెచ్ఎండిఏ ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్ రెడ్డి, స్థానిక నాయకులు చిట్టి ఉమేష్, పర్సా శ్యామ్ రావు, రైతులు పాల్గొన్నారు.



# కమ్యూనిటీ హాల్ పార్క్ అభివృద్ధికి సహకరించండి

- ఎంపీ ఈటెల రాజేందర్ కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే

కాప్రా,విశాలభారతి: మల్లాపూర్ డివిజన్ పరిధిలో ని నెహ్రూ నగర్ కాలనీ సర్వే నెంబర్ 43,44,45 లోని ఎన్ఎఫ్సి కంపెనీ ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న టీఎస్ఐఐసీకి చెందిన ఖాళీ స్థలంలో స్థానికులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ పార్క్ అభివృద్ధి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ ని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం అక్కడికి వస్తానని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి నాయకులు భాస్కర్, లక్ష్మి నారాయణ, బాబు, దుర్గయ్య వాసు , అంజి శేఖర్ మురళి పాల్గొన్నారు.



# కొండాపూర్ లో సర్వేనెంబర్ 87/2లో భూమి కబ్జా

- ఒకరుపై ఒకరు పరస్పరం ఫిర్యాదు
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు

శేరిలింగంపల్లి,విశాలభారతి:

శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ సర్వే నెంబర్ 87/2 లో ఉన్న తమ విలువైన భూమిని అనీల్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశాడని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి భార్య గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కొండాపూర్ లోని సర్వే నెంబర్ 87/2 లో ఉన్న తమకు చెందిన భూమిలో కబ్జా చేసి బోర్డు పాతారని ఆ విషయం ఈ నెల 5 తేదీన తెలిసి వారితో మాట్లాడి ఒరిజినల్ డాక్యుమెంట్స్ చూపించాలని కోరామన్నారు.అయితే ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకురావడంలో ఆయన విఫలం చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరిగి అదే స్థలంలో నరసింహారెడ్డి అనే వ్యక్తి మళ్ళీ తన ఫోన్ నెంబర్ వేసి కబ్జాకు ప్రయత్నిస్తున్నారని కోరుకుంటూ ఈనెల 8వ తేదీన స్వర్ణలత రెడ్డి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు అను సెక్షన్ల కింద వారిపై కేసు నమోదు చేశారు. కాగా ఆ స్థలం జి .నరసింహారెడ్డి ది అని తాను అక్కడ సూపర్వైజర్ గా పని చేస్తున్నానని కొందరు వ్యక్తులు తమ సైట్లోకి వచ్చి సెక్యూరిటీ రూమ్ కూల్చివేసి ప్రహరీ గోడను కూల్చివేశారంటూ షేక్ జమీల్ అనే వ్యక్తి వైవి సుబ్బారెడ్డి, స్వర్ణలత రెడ్డిల తో పాటు మొత్తం ఆరుగురుపై ఈనెల 8వ తేదీన గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వారిపై కేసులు నమోదు చేశారు.ఇలా ఒకరిపై ఒకరు పరస్పరం సర్వే నెంబరు 87/2 లోని భూమిపై ఇరు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా

ఆదివారం, 19.01.2025 హైదరాబాద్



cinema updates

## క్షమాపణ చెబితే సరిపోదు..



బీజేపీ నేత, సినీ నటి మాధవీలత, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకీ ముదురుతూనే ఉంది. తనను ప్రాస్టిట్యూట్ అంటూ పరుష పదజాలంతో దూషించిన జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలకు మాధవీలత ఉపక్రమించింది. ఆయనపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా), తెలుగు ఫిలిం ఛాంబర్‌కు మాధవీలత ఫిర్యాదు చేశారు. తన కంప్లయింట్ కాపీని మా ట్రెజరర్ శివబాలాజీకి అందజేశారు.ప్రభాకర్ రెడ్డి తన గురించి దారుణంగా మాట్లాడారని మాధవీలత అన్నారు. సినిమా వాళ్లపై ఆరోపణలు చేయడం సరైనది కాదు.. ఆయన క్షమాపణలు చెబితే సరిపోదని తెలిపారు. జేసీ ప్రభాకర్ రెడ్డిపై న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. తనపై జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సినీ పరిశ్రమ ఖండించలేదు కాబట్టే ఫిలిం ఛాంబర్, మాలో ఫిర్యాదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. మాలో ఫిర్యాదు చేయడానికి ముందు ఇన్‌స్టాగ్రామ్‌లోనూ మాధవీలత స్పందించారు. న్యాయం కోసం నా పోరాటం అంటూ పోస్టు పెట్టారు.



## ఓటీటీలోకి 'విడుదల పార్ట్ 2'..

తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి, మంజు వారియర్ జంటగా నటించిన తాజా చిత్రం విడుదల పార్ట్ 2 . ఈ సినిమాకు వెట్రి మారన్ దర్శకత్వం వహించగా.. కమెడియన్ సూరి కీలక పాత్రలో నటించాడు. 'విడుదల' చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. ఫస్ట్ పార్ట్ హిట్టు అవ్వడంతో భారీ అంచనాలతో పోయిన ప్రేక్షకులకు ఈ చిత్రం నిరాశ పరిచింది. అయితే రిలీజై నెల కూడా కాకుండానే ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతుంది.ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం జనవరి 19 నుంచి తెలుగుతో పాటు తమిళం భాషల్లో స్ట్రీమింగ్ అవ్వబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.ఈ సినిమా కథ విషయానికి వస్తే.. కానిస్టేబుల్ కుమరేశన్ (సూరి) ఇచ్చిన క్లూతో ప్రజదళం నాయకుడు పెరుమాళ్ అలియాస్ మాస్టార్ (విజయ్ సేతుపతి)ని పోలీసులు అరెస్ట్ చేస్తారు. దీంతో పార్ట్ 1 కథం ముగుస్తుంది. అయితే అక్కడినుంచే పార్ట్ 2 ప్రారంభం అవుతుంది. స్కూల్ పిల్లలకు పాఠాలు చెప్పకునే పెరుమాళ్ జమీందారి వ్యవస్థకు ఎందుకు అడ్డం తిరిగాడు. ఈ క్రమంలోనే అతడు నాయకుడిగా ఎలా మారాడు. అతడి జీవితంలోకి మహాలక్ష్మి (మంజు వారియర్) ఎలా వచ్చింది. తనను పట్టించిన కానిస్టేబుల్ కుమరేశన్ చివరకు ఏం చేశాడు అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.



## సిగ్గుగా ఉంది..

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కి క్షమాపణలు తెలిపింది నటి ఊర్వశీ రౌతేలా. నేను మీ గురించి ఇలా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నాను అంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టింది. సైఫ్ అలీఖాన్ మీద దుండగులు దాడి జరిపిన విషయం తెలిసిందే. గత గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు సైఫ్. అయితే సైఫ్ ఘటనపై బాలీవుడ్ సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు.అయితే ఈ విషయంపై నటి ఊర్వశీ రౌతేలా మీడియాతో స్పందిస్తూ.. సైఫ్‌పై దాడి దురదృష్టకరం. నేను ప్రస్తుతం డాకు మహరాజ్ సక్సెస్ మూడ్‌లో ఉన్నాను. ఇప్పటివరకు రూ.105కోట్లు వసూళ్లు సాధించింది. ఈ సినిమా సక్సెస్ అయినందుకు మా అమ్మ నాకు డైమండ్ రింగ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. మా నాన్న రోలెక్స్ వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. అయితే వీటిని ధరించాలంటే ఎవరైన దాడి చేస్తారేమో అని ఇప్పుడు భయమేస్తుంది. అంటూ చెప్పకోచ్చింది. అయితే రింగ్ ఇచ్చిందంటూ మీడియాకి చూపించడం.. అలాగే ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. సైఫ్ అలీఖాన్ చావు బ్రతుకుల మధ్య ఉంటే నువ్వు ఏం మాట్లాడుతున్నావు అంటూ ఊర్వశీపై నెటిజన్లు దుమ్మెత్తిపోశారు. దీంతో తాజాగా ఈ విషయంపై ఊర్వశీ సైఫ్‌కు క్షమాపణలు తెలిపింది. సైఫ్ సర్ ఈ సందేశం మీకు అందుతుందని ఆశిస్తున్న. మీ గురించి మాట్లాడే క్రమంలో నేను ప్రవర్తించిన తీరుపై నాకు సిగ్గుగా ఉంది. ఈ విషయంలో మీకు క్షమాపణలు తెలుపుతున్నా. ఇంటర్వ్యూ ఇచ్చే టైంలో మీపై జరిగిన దాడి ఎంత సీరియస్ అనేది నాకు పూర్తిగా తెలియదు. నేను ఒక సినిమా సక్సెస్‌లో మూడ్‌లో ఉండి.. ఆ సినిమాకి వచ్చిన గిఫ్ట్‌ల గురించి మాట్లాడాను ఈ విషయంలో సిగ్గుపడుతున్నా అంటూ ఉర్వశీ రాసుకోచ్చింది.

## నాని ప్రొడక్షన్‌లో ప్రియదర్శి 'కోర్టు'..

టాలీవుడ్ నటుడు నేచురల్ స్టార్ నాని సమర్పణలో వాల్ పోస్టర్ పతాకంపై వస్తున్న తాజా చిత్రం కోర్ట్ . స్టేట్ వర్సెస్ ఏ నోబడీ అనేది ఉపశీర్షిక. ఈ సినిమాలో ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. నూతన దర్శకుడు రామ్ జగదీశ్ తెరెకెక్కించనున్నారు. ప్రశాంతి ఈ సినిమాను నిర్మిస్తుంది. గత ఏడాది ఆగష్టులో షూటింగ్ స్టార్ట్ చేసిన ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అయితే తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను ఉగాది పండుగా కానుకగా మార్చి 14న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా స్పెషల్ వీడియోను పంచుకుంది. "నువ్వు మరి నేను అనుకున్నంత ఎదవవు ఏం కాదు. అంటే ఎంతో కొంత ఎదవనే అంటావు. ఏ కాదా.. సర్లే ఉండు.. నేను వెళ్లాలి.. హలో హలో.. నీ పేరు ఏంటి.. జాబిలి.. మరి నీ పేరు".. అంటూ బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌తో ఈ వీడియో ప్రారంభమైంది. వీడియో చూస్తుంటే.. అన్యాయంగా ఓ కేసులో ఇరుక్కుపోయిన ఓ పేదింటి కుర్రాడు...న్యాయం కోసం పోరాడే కథతో ఈ సినిమా రాబోతుంది. ఇందులో ప్రియదర్శి లాయర్ పాత్రలో నటించబోతున్నాడు. కాగా ఈ చిత్రంలో శివాజీ, సాయికుమార్, రోహిణి, హర్షవర్ధన్, శ్రీదేవి...కీలక పాత్రలు పోషిస్తున్నారు.




## ఎన్టీఆర్ నామస్మరణే మహాద్భాగ్యం

'ఎన్టీఆర్ యుగపురుషుడు. కారణజన్ముడు. అలాంటి వారు ఓ మహత్తర కార్యం కోసం దివి నుంచి భువికి వస్తారు. జీవితాన్ని సాఫల్యం చేసుకొని, కోట్ల మందికి ఆదర్శప్రాయులై మరలా దివికేగుతారు. నేడు ఎన్టీఆర్ భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన చూపించిన మార్గం సదా అనుసరణీయం. తెలుగు భాష, జాతి ఉన్నంతకాలం ఆయన చిరస్మరణీయుడిగా నిలిచిపోతారు' అన్నారు .ప్రముఖ దర్శకుడు వై. వి.యస్. చౌదరి. నేడు విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి. ఈ సందర్భంగా వై.వి.యస్.చౌదరి మాట్లాడుతూ 'ఎన్టీఆర్ కేవలం నటుడిగానే కాదు, దర్శకుడిగా, రాజకీయ వేత్తగా కోట్ల మందిలో స్ఫూర్తినింపారు. తెలుగు నేలపై రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చి ప్రజల జీవితాల్లో వెలుగుల్ని నింపారు. ఎందరికో రాజకీయ జీవితాన్ని ప్రసాదించారు. పురాణ పాత్రలకు వెండితెరపై సజీవరూపంలా నిలిచి భారతీయ హైందవ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటారు. సాధారణ కార్మికుల నుంచి సైంటిస్టుల వరకు ఆయన అందరికి స్ఫూర్తిప్రదాతగా నిలిచారు. నటుడిగా, రాజకీయవేత్తగా, తెలుగు భాష, విలువల పరిరక్షకుడిగా తెలుగు జాతికి మార్గదర్శకుడిగా నిలిచారు. ఓ వ్యక్తి తన జీవితకాలంలో ఇన్ని కార్యాల్లో సాఫల్యత సాధించడం అరుదైన విషయం. అది కారణజన్ములకే సాధ్యం. అలాంటి మహాపురుషుడి వర్ధంతి రోజున ఆయన పేరుని స్మరించుకోవడం పూర్వజన్మ సుకృతంలా, మహాద్భాగ్యంగా భావిస్తున్నా' అన్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.